

# జనం కోసం జేపి సురాజ్యయాత్ర

## యాత్రలు చేస్తే ప్రభుత్వాలు స్పందిస్తాయా?

# ఈ మధ్యే కేంద్ర ప్రభుత్వం  కొన్ని వస్తువులపై GSTతగ్గించింది ..ఎందుకంటే ప్రజలలో అసంతృప్తి పెరుగుతోందని, ప్రజలని సంతృప్తి పరచాలి అంటే కొంత పన్నుల భారం తగ్గించాలని కేంద్ర అర్థం చేసుకుంది.

# జోనల్ వ్యవస్థను రద్దు చేద్దాం అనుకున్న తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గి జోనల్ వ్యవస్థని కొనసాగించాలని నిర్ణయించుకుంది. జోనల్ వ్యవస్థ రద్దు చేస్తే కొన్ని జిల్లాల యువతలో అసంతృప్తి వస్తుందని అందుకే ఆ వ్యవస్థని కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించుకుంది.

# ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఇంటింటికి తెలుగుదేశం పేరుతో ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలని తెలుసుకుంటోంది . . ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సంక్షేమ పథకాల మీద భారీగా ఖర్చు పెడుతోంది. ప్రభుత్వం పై 80% ప్రజలు సంతృప్తిగా ఉండాలనే లక్ష్యంతో ఆ పార్టీ పని చేస్తోంది.

***ఈ మూడు ఘటనలలో ప్రజలు ఎక్కడా ప్రభుత్వాలకి వ్యతిరేకంగా రోడ్డు ఎక్కలేదు,  నిరసన ప్రదర్శనలు చేయలేదు,***
***కానీ ప్రభుత్వాలు  ప్రజలలో ఉన్న అసంతృప్తి ని చల్లార్చాలని తమకి తోచిన ప్రయత్నాలు చేస్తున్నాయి.***
***ఎందుకంటే.. ప్రజలు ఓట్లు వేస్తేనే వారికి అధికారం దక్కుతుంది కాబట్టి.***
***అధికారం పొందడం కోసం, ప్రభుత్వంలో  కొనసాగడం కోసం పార్టీలు  ఏపనైనా చేస్తాయి.***
***ప్రజలు అడిగితే ప్రభుత్వాలు తమకి సాధ్యమైన పనులు ఏవైనా చేయడానికి సిద్ధం.***
***మరి, మనం అడగవలసినవి అడుగుతున్నామా? అవగాహనతో అడుగుతున్నామా?   ఒకసారి చూద్దాం...***

## 1. విద్య, ఆరోగ్యం  కోసం  జేబులకి చిల్లు.

మన పన్నుల డబ్బుతో ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయి. అక్కడ మంచి ఉపాధ్యాయులు ఉన్నారు. వారికి ప్రైవేటు టీచర్ల కన్నా  మూడు నాలుగు రెట్లు ఎక్కువ జీతం ఇస్తున్నాం. అయినా అక్కడ చదువు చెబుతారనే నమ్మకం చాలామంది తల్లిదండ్రులలో లేక వేలకి వేలు ఖర్చు పెట్టి మరీ పిల్లలని ప్రైవేటు స్కూల్స్ కి పంపిస్తున్నారు. అంటే ఒక పక్క  ప్రభుత్వ పాఠశాలలు నడవడానికి పన్నులు కడుతున్నాం, మరోపక్క ప్రైవేట్ స్కూల్స్ కి ఫీజులు కడుతున్నాం. మా కెందుకీ డబుల్ ఖర్చు అని మనం ఎప్పుడైనా ప్రభుత్వాలని నిలదీసామా?  విద్యని బాగుచేయమని మనం ఎప్పుడైనా పార్టీలని, ప్రభుత్వాలని డిమాండ్ చేసామా? మీడియా లో మన విద్యా వ్యవస్థపై ఎప్పుడైనా సీరియస్ గా చర్చ జరిగిందా?

ఇదే పరిస్థితి మన ప్రభుత్వ ఆసుపత్రులది కూడా. ప్రభుత్వ డాక్టర్లకి జీతాలు తక్కువ కానీ మిగతా సిబ్బందికి మాత్రం

ప్రైవేట్ ఆసుపత్రుల కన్నా రెండు మూడు రెట్లు ఎక్కువ జీతాలు ఉన్నాయి. ఆ జీతాలు మన పన్నుల నుంచే వాళ్ళు తీసుకుంటున్నారు. అయినా మనకి మాత్రం అక్కడ వైద్యం అందుతుంది అనే నమ్మకం లేక ప్రైవేటు ఆసుపత్రులలో బిల్లులు కడుతూ జేబులకి చిల్లులు పెట్టుకుంటున్నాం. ఎందుకిలా అని ఎప్పుడైనా ఆలోచించామా? అన్నిజబ్బులకి (ఆరోగ్య శ్రీ లో కొన్ని జబ్బులకే ఉచిత వైద్యం) మంచి ప్రమాణాలు కలిగిన వైద్యం పూర్తి ఉచితంగా ప్రభుత్వమే అందించాలని మనం ఎప్పుడైనా ప్రభుత్వాలని పార్టీలని డిమాండ్ చేసామా?

## 2. ఉద్యోగాలు ఎక్కడ?

మన యువతరాన్ని తీసుకోండి...దేశంలో ఏటా కోటిన్నర మంది చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో పదో వంతు యువతకి కూడా సరైన ఉద్యోగం దొరకడం లేదు. మరి మిగిలిన వాళ్ళు ఏం చేయాలి? వీరి భవిష్యత్తు ఏంటి? మన యువత ప్రపంచం తో పోటీ పడి ఉద్యోగాలు, ఉపాధి పొందేందుకు ప్రభుత్వాలు చేయాల్సినంత చేస్తున్నాయా? ఉద్యోగాలు సృష్టించలేక నిరుద్యోగ భ్రుతి ఇస్తాం అని ప్రభుత్వాలు చెబుతున్నాయే కానీ, ఇన్ని కోట్లమంది ఉన్న మన యువతకి ఉపాధి కల్పించాలి అంటే ఏం చెయ్యాలి అని మన పార్లమెంట్ లో కానీ, అసెంబ్లీ లో కానీ, ఒక వారం రోజుల పాటు ఎప్పుడైనా చర్చించారా?

## 3. డెంగ్యూ లేదా చికున్ గున్యా లేని ఇల్లు ఉందా ?

మన గ్రామాలు, పట్టణాలు, నగరాల పరిస్థితి చూడండి.. డెంగ్యూ, చికున్ గున్యా లాంటి జబ్బులు రాని కుటుంబం ఒక్కటైనా ఉందా? గుంతలు లేని రోడ్లు ఉన్నాయా? డ్రైనేజి పొంగిపొర్లని ఊరు ఉందా? డబ్బులు పెట్టి డబ్బా నీళ్ళు కొనకుండా, కుళాయి(నల్లా) నీళ్ళు ధైర్యంగా తాగే పరిస్థితి ఉందా? వీటన్నిటి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా..మన గ్రామాలు, పట్టణాల పరిస్థితి మాత్రం ఆశించినంత మెరుగుపడడం లేదు. ఎందుకని..?

## 4. రైతుకి నష్టాలు, దళారులకి లాభాలు

మనదేశంలో 60% ప్రజలు ఇప్పటికీ వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, కూలీల కొరత, కల్తీ పురుగుమందులు, కరువులు, వరదలు, ఈ గండాలన్నీ దాటుకుని రైతు పంట పండించినా, దళారుల దోపిడీ తో గిట్టుబాటు ధర లేక దిగాలు పడుతున్నాడు. రుణ మాఫీలు, ఉచిత తాయిలాలు, వీటన్నిటితో తాత్కాలికంగా ఉపశమనమే కానీ రైతుల జీవితాలలో శాశ్వత వెలుగు నింపే ప్రయత్నం మాత్రం జరగడం లేదు.

## 5. లంచాలు లేని ప్రభుత్వ కార్యాలయం ఉందా?

రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ చూస్తే, దాదాపు మూడో వంతు నిధులు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నాయి. ఒక చిన్న రైతు ఏడాది ఆదాయం కన్నా, ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి నెల జీతం ఎక్కువ (లంచాలు కాకుండా) అంటే అతిశయోక్తి కాదు. మన ప్రభుత్వాలు శక్తికి మించి ఉద్యోగులకి జీతాలు ఇస్తున్నాయి. కానీ ఒక్క ప్రభుత్వ కార్యాలయంలో అయినా లంచం లేకుండా చిన్న పని అయినా అవుతుందనే నమ్మకం ఉందా? మన పన్నుల డబ్బుతో జీతాలు ఇస్తూ, దానికి తోడు లంచాలు ఇస్తూ, వారి ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి. ప్రభుత్వ ఉద్యోగులలో జవాబుదారీతనం తేవడం కోసం, లంచాలు లేకుండా, ప్రజలకి సకాలంలో సేవలు అందేలా చూసేందుకు మన ప్రభుత్వాలు ఎప్పుడైనా పటిష్టమైన చర్యలు తీసుకున్నాయా?

## 6. చట్టం కొందరికి చుట్టం

మనదేశంలో హత్యలు, అత్యాచారాలు, మోసాలు పెరిగిపోతున్నాయి. ఇంటి నుంచి బయటికి వెళ్ళిన ఆడపిల్ల తిరిగొచ్చేదాకా తల్లిదండ్రులకి టెన్షన్ తప్పడం లేదు. తప్పు చేసిన వారికి వెంటనే శిక్ష పడుతుందనే భయం కానీ; తప్పు చేసినవాడికి ఎంత పలుకుబడి ఉన్నా చట్టం నుంచి తప్పించుకోలేడు అనే భరోసా కానీ ఉందా? బడా బాబులకో న్యాయం బడుగులకో న్యాయం అనేది మన దేశంలో స్థిరపడిపోయింది. ఈ పరిస్థితి మార్చాలని , చట్టం ముందు అందరూ సమానంగా ఉండే చట్టబద్ధ పాలన రావాలని మనం డిమాండ్ చేస్తే, ఈ దుస్థితి ఎందుకు మారదు?

- **విద్య, ఆరోగ్య రంగాలని సంస్కరిస్తే మనకి స్కూలు ఫీజులు, ఆసుపత్రి బిల్లుల భారం తగ్గి బోలెడంత డబ్బు ఆదా అవుతుంది.**
- **యువతకి ఉపాధి అవకాశాలు పెరిగితే, చేతినిండా పని దొరికితే యువతరంలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వ్యవసాయం లాభ సాటిగా మారితే రైతుల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతాయి.**
- **మనగ్రామాలు పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజి , పారిశుధ్యం, మంచి నీళ్ళు మెరుగుపడితే మనకి అనేక రోగాల నుంచి విముక్తి లభిస్తుంది, జీవన నాణ్యత పెరుగుతుంది.**
- **లంచాలు లేకుండా ప్రభుత్వ కార్యాలయాలలో పనులు జరిగితే, చట్టబద్ధ పాలన అమలు జరిగితే ప్రభుత్వాలపై విశ్వాసం పెరుగుతుంది, సమాజంలో నిజాయితీ పెరుగుతుంది.**

**ఈ ఆరు పనులు చేయడం పూర్తిగా సాధ్యం. ఈ ఆరు పనులు జరిగితే అదే సురాజ్యం..**

ఇవి ఎప్పుడు జరుగుతాయి అంటే.. మనం అడిగితే జరుగుతాయి, మన అసంతృప్తిని ప్రభుత్వాలకి పార్టీలకి బలంగా వినిపిస్తే జరుగుతాయి, మన మీడియా ఇలాంటి అంశాలపై అర్థవంతమైన చర్చలు చేస్తే జరుగుతాయి, మన పార్టీలు వీటి గురించి ఆలోచిస్తే జరుగుతాయి.. అలా జరిగేలా చేయడం కోసమే ఈ సురాజ్య యాత్ర.

**మనం ఎదుర్కొంటున్న సమస్యలని ఎన్నికల రాజకీయాలకి అతీతంగా చర్చించడానికి, పరిష్కారాలు సూచించడానికి; మనం పార్టీలని ప్రభుత్వాలని ఏం అడగాలో అవగాహన పెంచడానికి లోక్ సత్తా వ్యవస్థాపకులు డా.జెపి చేస్తున్న ఈ సురాజ్య యాత్రలో పాల్గొనండి. మద్దతు ఇవ్వండి. మీ వంతు సహకారం అందించండి.**